


# చీకటి పడుతోంది

స్వాతంత్ర్యం వచ్చింది కదా! సంబరానికేం కొదువ :

స్కూలు గ్రౌండు లో ఆటల పోటీలు జరుగు తున్నాయి. గ్రాంఫోన్ లో పాటలు మ్రోగుతున్నాయి. "స్వాతంత్ర్యం వచ్చెనని సభలే చేసి సంబర పడగానే సరిపోదోయీ" పాత పాట ఎవరో పొరపాటున వేసినట్టున్నారు. ఏదో తప్పైనట్టు మధ్యలో ఆపి "మెత్తగ వున్నానన్నాత్తకు మామా' పాట వేశారు. పాటకు అందరూ చెవులు రిక్కించారు. కొందరు విద్యార్థులు శృతి కలిపారు కొందరు లయబద్ధంగా నడుమూ కదిలించేరు. "అయ్యో, అన్యాలం! బళ్ళె గివ్వేం పాటలు?' గ్రౌండ్‌లో ఓ చెట్టు క్రింద కూర్చుని పేపరు చదువుకుంటున్న ఓ ముసలి మాస్టారు అనుకుని భరించలేక హాయిగా పొడుం పీల్చుకున్నాడు.

స్టాఫ్ రూంలో ఉపాధ్యాయులు కూడా రోజటిలాగే ఆటలో పోటీ పెట్టుకున్నారు. నిశ్శబ్దంగా కూర్చున్న వారిలో వుండి వుండి ఎవరో

ఒకరు వికృతంగా నవ్వుతున్నారు. కొందరు సకిలిస్తున్నారు. టేబుల్ మధ్య రూపాయల కుప్ప, జోకరు దొరకని కొందరి దివాలా ముఖాలలో మెరుస్తోంది. కవ్విస్తోంది. కాని చేతిలోని ముక్కలు నవ్వించడం లేదు. అక్కడంతా సిగరెట్ వాసన...ఇప్పటి పాట అందరికీ నచ్చింది. మళ్ళీ అదే వేయించుకున్నారు. బయట ముసలి మాష్టారు సౌండ్ బాక్స వైపు ఆశ్చర్యంగా చూసి, తలవంచుకున్నారు.

ప్యూన్ శరీఫ్ సంచి నిండా సీసాలు. పెద్ద ఖారా పొట్లం, పకోడీలు పట్టుకొచ్చి స్టాఫ్ రూంలో పెట్టాడు. టీచర్లందరు ఆశగా చూశారు.

"ఓహో ఇండిపెండెన్స డే సెలబ్రేషన్సు జోరుగా సాగుతున్నట్టున్నాయి." అన్నాడు కృష్ణమూర్తి.

"ఇంతకు ఎవరు ఇదంతా చేసేది?" అమాయకంగా అడిగాడు. మొన్నీ మధ్య ఫిక్సడ్ పే మీద కొత్తగా అపాయింటయిన రాజారావు.

మిగిలిన వాళ్ళందరు గొల్లు మన్నారు.

ఓ నిమిషం తర్వాత వెంకట్రాం చెప్పాడు. కాంట్రిబ్యూషనేమో అని భయపడకు. స్కూలు ఫండ్ నుంచే ఇవన్నీ తెప్పిస్తాండు హెడ్ మాస్టరు. మనోడే కదటోయ్ చెప్పినట్టు వింటడు. ఇండిపెండేన్స డే సెలబేషన్స కొరకు అయ్యే ఖర్చులనే యిదంత ఒస్తది, పిల్లలకు ప్రైజులిస్తలేం కద, రాత్రికి కల్చరల్ ప్రోగ్రామ్స జరుపుత లేం గద, ఇట్లనే యింక కొన్ని... రిపోర్టుల మాత్రం ఇయ్యన్ని జరిపినట్టు రాస్తామనుకో... అది వేరే సంగతి... యింతకూ... ఆదరాద్ అదరాదనుకుంటనే... బాగనే గుంజుతానవ్' బొమ్మలు పైకెత్తి దీర్ఘంగా చూశాడు.

"ఇంతకూ హెడ్మాస్టరు ఇయ్యాల్ల గూడ పోయిండా వైద్యానికి? ఒక్క రోజన్న సరదాగా స్కూల్ల వుండి ఎంజాయ్ చెయ్యక''

'రాజారావ్ నువ్వు తెలిసి తెల్వక మాట్లాడకు నీకేం తెల్సు ఎంజాయ్ అంటే? వెదవ బతుకు మనది గూడ ఓ ఎంజాయా! హెడ్మాస్టర్ను అడుగు చెప్తడు మందియ్యడంలనే వున్నది. ప్చ్- అది... తీస్కోవడంలనె ఉన్నది. అనంటడు'

రాఘవేందర్ హిస్టరీ టీచరు మాటలు పూర్తికాకుండానే రకరకాల నవ్వులు వికృత రూపం దాల్చాయి.

హెడ్మాస్టరు, అసిస్టెంటు లింగరాజు అప్పుడే వచ్చి పక్కగదిలో కూర్చునట్టు చెప్పాడు శరీఫ్. అందరూ నవ్వులు తగ్గించారు. ఎవరి ముక్కలు వాళ్ళు చూసుకుంటూ సరిచేసుకుంటూ —

హెడ్మాస్టరు చలపతి వైద్యం కూడా చేస్తాడు. వూళ్ళో ఎటువంటి డాక్టరూ లేనందువల్ల ఇక ఈ హెడ్మాస్టరే డాక్టరు. డాక్టరే చలపతి.

వెనకటికి చలపతి తండ్రిగారు పెద్ద పేరు సంపాదించిన ఆయుర్వేద వైద్యుడు. తండ్రి దగ్గరే వైద్యం నేర్చుకున్నాడు కాని, రాను రాను ఆయుర్వేద ఔషదాల కన్న అలోపతిక్ మెడిసన్స్ పట్ల ప్రజలు శ్రద్ధ చూపుతున్నందువల్ల చలపతి కూడా అవే ఎక్కువ వాడడం క్రమంగా నేర్చుకున్నాడు. చుట్టూ మూడు నాలుగు వూళ్ళలో ఎవరికే మొచ్చినా అది ఈ చలపతి చూడాల్సిందే. ఒక్కొక్కప్పుడు స్కూలు నడుస్తున్న సమయంలో లేదా క్లాసు తీసుకుంటూ మధ్యలో వదిలి కూడా, సైకిల్ మీద పరిగెత్తి వెళ్ళి చూసి వచ్చేవాడు. డబ్బు బాగా గుంజుతాడు. కాని పైస తిన్నా పని జేస్తడు అని అందరు అనుకుంటారు. వైద్య వృత్తి వల్ల తను ప్రధానోపాధ్యాయుడుగా పనులు సరిగా నిర్వహించక పోయినా

స్టాఫ్‌లో ఎవరూ ఏమీ అనరు. వారిని ఏదో రకంగా సంతృప్తి పరచి లోబరుచు కుంటాడు.

ఇప్పుడు ఈ రెండు సంవత్సరాల నుండి కొంత విశ్రాంతిగా వుంటున్నాడు. లింగరాజు రావడం అతని కెంతో నయమైంది. అతని కంటే ఎంతో చిన్నవాడైనా, లింగరాజుకు అతనికి మంచి స్నేహం వుంది. అది యిప్పటిది కాదు. వరంగల్ బి.యిడి. ట్రైనింగ్ కాలేజిలో కుదిరి సుస్థిరంగా వుండిపోయిన స్నేహం. అది ఏడాది క్రితమే లింగరాజు ట్రాన్స్‌ఫర్ అయి ఈ వూరి కొచ్చాడు. వచ్చినప్పటి నుండి వైద్య వృత్తిలో కొంత సహాయ పడుతున్నాడు. క్రమంగా ఏదైనా కేసు చెబితే వెళ్ళి చూసి మందులిచ్చి వస్తున్నాడు. కూడ.

లింగరాజుది చాలా పెద్ద కుటుంబం. కష్టాలు కన్నీళ్ళు ఆ కుటుంబంలో ప్రతిరోజూ మామూలే! రెక్కలు విరుచుకొని ఉద్యోగం చేసేవాడూ, బాధ్యత కావడి మోస్తూ తిరిగే వాడూ ఇతడొక్కడే!

అందుకే చలపతికి సన్నిహితంగా వుంటూ, సహాయపడుతూ కొంత డబ్బు సంపాదిస్తున్నాడు. అప్పుడప్పుడు చలపతికి తీరిక లేకపోతే అతని పొలాల వైపు వెళ్ళి పనులు చూసి వచ్చి పరిస్థితులు చెబుతుంటాడు. స్నేహ పూర్వకంగానో, కుటుంబ సభ్యుడిలా వుంటున్నాడనో, అన్ని పనుల్లో సహాయపడుతున్నాడనో పంట యింటికి రాగానే చలపతి కొంత ధాన్యం పంపిస్తాడు. మొహమాట పడుతూనే తీసుకుంటాడు లింగరాజు.

చలపతికి, ఉద్యోగం వైద్యం కాకుండా వ్యవసాయం మీద కూడా రాబడి వుంది. తండ్రి తాతలు సంపాదించిన మంచి తరి పొలం వుంది. మంచి ఎరువులు వేసి పంట బాగా తీస్తాడు. అందువల్ల ఆ వూర్లోని మోతుబరి రైతులలో చలపతి కూడా ఒకడు. ఎప్పుడూ

ఎన్నో రకాల మనుషులు వచ్చి పోతుండే యిల్లు ఆతనిది. కాని ఒకటి, అతని ప్రవర్తన గూర్చి గుసగుసలు పెట్టుకుంటారు చాలామంది. కాని ఎదురుపడి అడగరు. అతనితో మంచిగా వుంటారు. అతనితో అందరికీ అవసరం పడుతుంది గనక!

"లింగ రాజూ నువ్వు కొంచెమాగినంక పొయ్యి, మల్లోసారి యిప్పటామెను జూశిరా. పరిస్థితి జూశి ఇంజక్షనిచ్చిరా-" అని చెప్ప కుంటూ టేబుల్ పై బెల్ నొక్కాడు.

సరే—అన్నట్లు తలవూపాడు లింగరాజు.

శరీఫ్ పరిగెత్తుకుంటూ వచ్చాడు హెడ్మాస్టర్ గదిలోకి.

''ఆ తలుపేసి బయట కూసో యెవ్వర్నీ రానీయకు. సీసలెక్కడ బెట్టినవ్? ఆ సార్లందరి కిచ్చినవా?''

''ఆడ బెట్టొచ్చిన సార్, అల్లు యిస్పేటు ఆట మీద బడ్డరు-' అనంటూ టేబుల్ కింది నుండి తీసి సీసాలు పైన పెట్టాడు. గ్లాసులు ఖారా వగైరా సామాగ్రంతా పెట్టి వెళ్ళి పొయ్యాడు తలుపువేసు కుంటూ—

అ(-లింగరాజూ ఇగ మనమేసు కుందామా మందూ?-''

లింగరాజు మొహమాటంగా నవ్వాడు.

నేను బయటకి పోవాలె గద సార్. మీరు కానీండి. ట్యూషన్ పిల్ల లొచ్చిం।డొ ఏమో యింటిదాక బొయ్యి, అన్నించి యిప్పటి పేషంట్ ను సూస్కుంట యిట్లొ స్త.''

ఇయ్యాల్ల పంద్రాగస్టు పోరగాల్లు ట్యూషన్ కొస్తారు? ఎగుర తుంటరు. కొంచెం యేసొ్కని పో.

ఎండ్రైకైన మంచిది గదసార్. అట్ల బొయ్యేచ్చి నంక ఏస్కుంట తీయింద్రి అంతయితె-బెదురు బెదురుగా అన్నాడు లింగరాజు.

సీస గ్లాసులోకి వొంచుతూ బిగ్గరగా నవ్వాడు చలపతి. నా ముంద టుండంగ నువ్వొచ్చె దాకుంటాది? ఏమ్మాటమాట్లాడ్తవ్ నువు గూడ అట నువ్వొచ్చేదాక వుంచుమని ఇన్‌డైరెక్టుగా చెప్తున్నవ్ లే- అంటూనే గట గట తాగేసాడు.

ఏహే గదేం లేదు సార్ లేచి తలుపు వైపు కదిలాడు. లింగరాజు.

ఇగో పోతె పోతివి గని తొందరగరా! నీది నీకే వుంచుత. సీసా చూయిస్తూ అన్నాడు. నవ్వాలని అనిపించకున్నా నవ్వాడు లింగరాజు. బయటికి వెళ్ళి తలుపేసాడు.

మళ్ళీ గ్లాసులో వంచుతున్నప్పుడు గళగళ శబ్దం...వినిపించకుండా ప్రక్కనే స్టాఫ్ రూం నుండి ఒకటేగోల. వాళ్ళంతా తనచేతిలోని పిచ్చుకలు అన్నట్టు చేతిలోని గ్లాసు చూసుకున్నాడు. మత్తుగా వుంది. తల వంచుకుని తయారుగా నిలబడ్డ అభిసారికలా అనిపించింది-గడగడా త్రాగేసాడు. ...............

అలా చాలా సేపయింది. సమయమెంతయిందో తెలీదు. గదంతా మత్తుగా కనిపించింది. కొంతదూరంలో తన కుర్చీ, టేబుల్...పైన గోడకు గాంధీ, నెహ్రూ, రాజేంద్రప్రసాద్, రాధాకృష్ణన్ ఫోటోలు - ఫోటోలో వాళ్ళు నవ్వుతున్నట్టు కనిపించారు. అతను కూడా చిన్నగా నవ్వాడు. మరోవైపు ఇందిరా గాంధీ ఫోటో మసక, మసకగా ఆశీర్వదిస్తున్నట్లు అనిపించింది. నవ్వుకుంటూనే చిన్నగా తలాడించాడు. గదిలో నాలుగుగోడలు అటూఇటూ పరుగెడుతున్నాయి. కప్పు గుండ్రంగా

తిరుగుతోంది. అతను కూర్చోలేదు. అట్లని నిలబడలేదు – ఎటో లేచి పోతున్నట్టు తేలిపోతున్నట్టు హాయిగా...మెత్తగా...మెత్తగా...

తలుపు తెరచుకుని గభాలున - శరీఫ్‌లోనికొచ్చాడు,

చీకట్లో ట్యూబ్‌లైట్ వెలిగినట్లయింది. తలుపు దగ్గర శరీఫ్ కనిపించాడు. చేతిలో నలుగుతున్న స్పాంజ్‌పిల్లో తీసి ప్రక్కన పెట్టాడు. ప్రక్క గదిలోంచి టీచర్ల కేకలు వినిపించడం లేదు. ఒకడి మీద ఒకడు పడి గునుస్తున్నట్టున్నారు.

'సార్ నర్శిమ్ లొచ్చిండు, మీ కోసానికి. అద్దగంట నించి సతాయిస్తాండు. ఈడ లొల్లి బెట్టకు ఫో అంటె - అద గ్రౌండ్ల శెట్టుకింద కూసున్నడు.'

'ఏ నర్సింలు?'

'ఆడు అనుముల నర్సింలు. ఊరి బయటుంటడు. కమ్మరి కొలిమి పక్కకు...'

'ఆఁ- ఆఁ- ఆడా? శెంద్రి మొగడా?'

'ఆవ్'

'ఏదంట?'

'పెండ్లానికి బాగలేదంట - నొప్పట. మందుకోసమని—'

'నొప్పి' వికటంగా నవ్వాడు. 'ఏడనట'- మళ్ళీ నవ్వాడు. కొంచెం తేరుకుని "ఇట్రమ్మను"- అంటూ మరోమూత తీసాడు చలపతి.

'శెంద్రీ... చెంచు లచ్చిమీ!' పళ్ళు పటాపటా కొరికాడు. ఈ

నాటికి శేతి కందినవ్ ఫో. ఇప్పటికి రెండు సార్లు, శీకట్ల వొరాల మీద దొరక్క బడితె నన్ను కాదని తప్పించుకున్నవ్ లే, ఇప్పుడు జూస్త- ఎవ్వనిక్కీ లొంగనని బింకం, నీ తల్లి... నా దగ్గర్నానె నీ పోకడ్లు? గతాన్ని జ్ఞాపకం చేసుకున్నాడు. మరో అరగ్లాసు త్రాగేడు. చిన్నినోరు పెద్ద కళ్ళు, నడక వయ్యారం, నల్లగా వున్నా కొబ్బరి ముక్కల్లాంటి కండరాలు... చంద్రి ఆకారం కళ్ళ ముందు కదిలి చలపతి మనసంతా బీర్-లా పొంగి పోతోంది.

ఆ స్థితిలో-

నర్సింలు నెత్తికొట్టుకుంటూ, దండాలు పెట్టుకుంటూ, గొణుక్కుంటూ వచ్చి, అమాంతం కాళ్ళ మీద పడ్డాడు.

''అయ్యా నా శెంద్రయ్య, శెంద్రి! పున్యానికి సచ్చేటట్టున్నది. పశిద్ద కున్నది. ఎన్కనించి నొప్పులు, మంత్రసానున్నది గని బయపడ్తాంది. ఇగ నువ్వేదిక్కు శార్. నీ కాల్లుమొక్కుత. పిల్ల బత్కకుంటే వాయె, గని దాన్ని బత్కియ్ అయ్యా-''

వూళ్ళో పులి లాంటి నర్సింలు తన కాళ్ళమీద పడడం చూసి, చలపతి లోని గర్వం తలెత్తి ఆడింది. తన చేతిలోని ఇంజక్షనుకు ఎంత విలువ? అనుకున్నాడు.

"ఏయ్-నర్సింలు నన్ను జూస్తున్నావ్‌గద! నేనైతె ఒచ్చేటట్టులేను. పొయిరా పొయిరా, రేపొద్దుగాల జూస్త"

'అయ్యా నీ బాంచెను. గట్లనకు. నీదగ్గర పన్జేశే శిన్న సార్నన్న తోలియ్, పొద్దుగాల దాక యేడుంటది? సచ్చిపోతది. నీ కాల్లు మొక్కుత మళ్ళీ పట్టుకున్నాడు.

"ష్... ఎహేయ్-కాళ్ళిడువు. ఏ మేడ్పురా అదిః అడిదానోలె-ఇటిను, నేన్జెప్పినట్టు జేస్తవాః

''అదయ్య గులాపోన్ని ఎట్లెట్ల జెయ్య- తోలు ఒలశి చెప్పలు కుట్టియ్య మన్నా సరే-గని నాశెంద్రిని నాకు దక్కియ్' నర్సింలు ఏడుపు.

'ఇగో నువ్వేడుపు మానితేనె నేన్ జెప్పేది. అట్లయితె ఇటు దగ్గ రికి రా చెప్త" అన్నాడే గని ఎలా చెప్పాలన్నది చలపతిలో భయం. ఆలస్యమౌతున్న కొద్దీ, చచ్చిపోతుందేమో నని నర్సింలు భయం.

మనుషులె-మనుసులు వేరు. అవసరాలు వేరు.

ఇద్దర్లో భయమే రూపాలు వేరు.

తలుపు తీసుకొని వచ్చాడు లింగరాజు. చెప్పబోతున్న వాడల్లా తడబడ్డాడు చలపతి. ఏదో కాని వేళలో వచ్చినట్టు అతన్ని అదోలా చూసాడు. వెంటనే తేరుకుని, 'లింగరాజూ ఇగో గీని పెండ్లానికి ప్రసూతి కష్టంగ వుందట. చూసి ఇంజక్షనిచ్చి రావాలె. నీకు తెల్సుకద, ఏంది ? తొందర్గ తయారు చేసుకో ఫో...''

మంచి దన్నట్టు తలూపి, గది నుండి బయట పడి, మరో గదిలోకి వెళ్ళిపొయ్యాడు లింగరాజు

చీకటి పడుతోంది. ఆడుకుంటూ పిల్లలెవరూ లేరు. కుంకుమ లేని విధవరాలి నొసటిలా వుంది గ్రౌండు.

మరికొంత సేపటికి నర్సింలు బయటికొచ్చాడు. ఇదివరకటిలా లేదు. ఏదో గొప్ప మార్పుంది. కొలిమి నుండి తీసిన యినుప ముద్ద

లాగున్నాడు. నర్సింలు, ఏదో ఓ రకపు మృత్యువును నింపుకున్న నిశ్శబ్దంలా మెట్లుదిగి గ్రౌండ్ వైపు వెళ్తున్న నర్సింలు నడక గదు లన్నింటికీ తాళాలేసుకుంటూ వస్తున్న శరీఫ్‌కు విచిత్రంగా తోచింది...

★ ★

దూరంగా ఊరి బయట, పొలాలకు ఆవల కొండల వెనుక, భూమి ఆకాశం కలుస్తున్న చోట, వెలుగూ చీకటి కలుస్తున్న చోట... ముసలి వెలుగు మరీ కృంగి పోతూ అంది– 'నర్సింలు చలపతికి మాట యిచ్చిన రాత్రి వచ్చేసింది. అబ్బా! అంత ఘోరాన్ని నీవీ రాత్రి ఎలా భరిస్తావో? కళ్ళుండి చూస్తూ నేనేం చెయ్యలేక పోయ్యాను. కళ్ళు లేని నీవెలా చేస్తావో?

"ఏమా మాట? ఏమా ఘోరం?" అనడిగింది అర్థం కాని లేత చీకటి.

"చాలా రోజుల క్రితం మాట. చెంద్రి సుఖంగా కొడుకును కన డానికి చలపతి వైద్య సహాయంచేశాడు నీకు తెలుసా?" ఆడిగింది వెలుగు. తెలిదన్నట్లు తలూపింది సంధ్య చీకటి.

'అవును చేశాడు! లేకుంటే చచ్చిపోయే దేమో కూడా. కాని యేం లాభం? ఓ ఒప్పదం పెట్టాడు. ఆ స్థితిలో ఏమీ చేయలేని నర్సింలు ఒప్పేసుకున్నాడు...... కాదు – చలపతి బలవంతంగా ఒప్పించు కున్నాడు.''

'ఏమా ఒప్పందం?'' ఆతంగ్రా ఆడిగింది చీకటి.

ఆ సాయంత్రం చలపతి నర్సింల్నిలా నిర్మోహ మాటంగా అడి గేడు–నీ పెళ్ళాం చక్కన్దిరా. దాని మీంచి మన్సు మరల్చుకునేట్టు లేను

అది బాగయ్యాక, నేను చెప్పంపిన రోజు ఓ రాత్రి నా దగ్గరికి పంపించు అంతే......"

హే భగవాన్ ఒక్కసారి బరువుగా శ్వాసవదలింది చీకటి. చెట్లన్నీ కళవళ పడ్డాయి గాలికి.

ష్ ఆగు! మధ్యలో అలాంటి వాడేవాడూ లేడు. కాని ఇలాంటి వన్నీ వాడే చేయిస్తున్నాడు'' వెంటనే అంది వెలుగు.

వెలుగు పూర్తిగా వెనక్కి తిరిగింది.

ఛీ... ఛీ... ఇంత ఘోరమా?" అన్న చీకటి, మనిషి దుర్బుద్ధిని మళ్ళీ...మళ్ళీ...తల్చుకుని, తల్చుకుని కుమిలి, కమిలి మరీ మరీ నల్ల బడింది.

కేకలు

వారపత్రిక

1975